బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు విడుదల చేయాలి

- టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుకు తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ విజ్ఞప్తి చేశారు. గతంలో కేటాయించిన నిధులను సకాలంలో విడుదల చేయకపోగా, కొత్త బడ్జెట్‌లో కేటాయింపులే లేవని బ్రాహ్మణులంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నట్లు ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. గత కేటాయింపులను విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబును అనేకసార్లు కలిసి వినతిపత్రాలు, పోస్ట్‌కార్డుల ద్వారా కోరినా ఫలితం లేదని తెలిపారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తమకు నిధుల కేటాయింపు, విడుదల విషయంలో స్పష్టత వస్తుందని ఆశించినట్లు పేర్కొన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాలేదని తెలిపారు. వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు.

రాష్ట్రంలో మండలిని రద్దు చేయిస్తా: గోనె

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో శాసన మండలి రద్దు అవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మాట్లాడారు. తెలంగాణలో జరుగుతున్న చేరికలు కాంగ్రెస్‌కు అప్రతిష్ట తెస్తాయని తెలిపారు. కోర్టుకు వెళ్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, వారందరిపై అనర్హత వేటు పడటం ఖాయమని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రంలో శాసన మండలి చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. కనీసం 120 మంది ఎమ్మెల్యేలు ఉంటే తప్ప శాసనమండలి ఏర్పాటు చేయడం కుదరదని గుర్తు చేశారు. ప్రస్తుతం 119 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. ఈ విషయమై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తానని, కోర్టులో కూడా పిటిషన్ వేస్తానని చెప్పారు.

52 లక్షల వేతనంతో కొలువు

- 'ఎన్వీడియా'లో కరీంనగర్ వాసి ఆశ్రితకు భారీ ప్యాకేజీ

తిమ్మాపూర్ రూరల్, జూలై 26: కరీంనగర్‌లోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ పూర్వ విద్యార్థిని భారీ ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. ఎం ఆశ్రిత రూ.52 లక్షల వార్షిక వేతనంతో బెంగళూరులోని ఎన్వీడియా కంపెనీలో ఏఎస్ఐసీ ఇంజినీర్‌గా ఎంపికైంది. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన ఆశ్రిత ఓ రైతు కుటుంబంలో జన్మించింది. 2022లో జ్యోతిష్మతిలో బీటెక్ పూర్తి చేసిందని కాలేజీ చైర్మన్ సాగర్‌రావు తెలిపారు. గతంలో ఇస్రోలో ఇంజినీర్‌గా ఎంపికైనప్పటికీ ఆ ఉద్యోగాన్ని వదులుకున్నదని పేర్కొన్నారు. అలాగే రాజేశ్‌కుమార్ కాల్‌క్వామ్ ఇండియా కంపెనీలో 16.85 లక్షల ప్యాకేజీతో అసోసియేట్ ఇంజినీర్ ఉద్యోగం సాధించాడు. వీరిని కళాశాల చైర్మన్, సెక్రటరీ కరస్పాండెంట్ సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ కేఎస్ రావు, డీఎన్ వైశాలి అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలంటూ విద్యార్థులు కదం తొక్కారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని బీజాపూర్ రహదారిపై గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 7 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించి విద్యార్థులను ఈడ్చుకెళ్లారు. – చేవెళ్లటౌన్

వెబ్ ఆప్షన్స్‌లో పాఠశాల పేరు మాయం

- టీచర్లు లేక పాఠాలు బోధించుకుంటున్న విద్యార్థులు
- పాఠశాల ఎదుట గ్రామస్థులు, తల్లిదండ్రుల ఆందోళన

కోమటికుంట పాఠశాలలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న చిన్నారి

లింగాల, జూలై 26 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో అవకతవకలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయి. ఉపాధ్యాయులను నియమించకపోవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు తరగతులు ఉండగా..74 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా.. ఇటీవల చేపట్టిన బదిలీల్లో హెచ్ఎం అంజిలాల్‌తోపాటు నలుగురు ఎస్జీటీలు వేరే చోటకు వెళ్లారు. విద్యాశాఖ అధికారులు వెబ్ ఆప్షన్స్‌లో కోమటికుంట పాఠశాల పేరును చూపించకపోవడంతో ఆ స్థానాలు భర్తీ కాలేదు. టీచర్లు లేకపోవడంతో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలను బోధించాల్సిన దుస్థితి ఏర్పడింది. హెచ్ఎం అంజిలాల్ వటవర్లపల్లికి బదిలీ కాగా.. డీఈవో ఆదేశాల మేరకు కోమటికుంట పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక గదిలో ఒకటి నుంచి 3 తరగతుల వరకు, మరో గదిలో 4 నుంచి 7 తరగతుల వరకు పాఠాలు బోధిస్తున్నారు. ఉపాధ్యాయుడు నరేశ్ నారాయణపేట జిల్లాకు బదిలీ కాగా.. అతడిని కోమటికుంటలో కొన్ని రోజులు విధులు నిర్వర్తించాలని డీఈవో ఆదేశించారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఎప్పుడు బదిలీపై వెళ్తారో తెలియడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో చంద్రుడును వివరణ కోరగా.. త్వరలోనే ఉపాధ్యాయులను నియమిస్తామని తెలిపారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

మెట్‌పల్లి రూరల్, జూలై 26: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో గురువారం అర్ధరాత్రి ఓ విద్యార్థి మరణించడం, మరో ఇద్దరు అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. ఆరపేటకు చెందిన రాజారపు గణాదిత్య(13) పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత గణాదిత్య వాంతులు చేసుకోవడంతో తోటి విద్యార్థులు కేర్‌టేకర్ వెంకట్, ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌కు తెలిపారు. తండ్రి మహేశ్‌కు తెల్లవారుజామున 3.45 గంటలకు ఫోన్ చేసి చెప్పడంతో, బైక్‌పై మెట్‌పల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. అలాగే అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థులను దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు పాముకాటువల్లే అస్వస్థతకు గురైనట్టు తెలిపారు. గణాదిత్య కూడా పాముకాటుతోనే మరణించినట్టు భావిస్తున్నారు.

ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): టీజీఎస్ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్ (మెటీరియల్) పోస్టుల భర్తీకి మెకానికల్ సిబ్బందికి అనుమతిస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీచేసింది. డిపార్ట్‌మెంట్ పరీక్షలు నిర్వహించడానికి ఆర్టీసీ యాజమాన్యం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

జూరాలకు 2.58 లక్షల క్యూసెక్కుల వరద

- శ్రీశైలంలో 109 టీఎంసీలకు చేరిన నిల్వ
- పోతిరెడ్డిపాడు నుంచి 12 టీఎంసీలకు ఏపీ డిమాండ్

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ)/న్యూస్ నెట్‌వర్క్: కర్ణాటక, మహారాష్ట్రతో పాటు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణలో వరద పోటెత్తుతున్నది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. ఆయా ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకోగా, గేట్లను ఎత్తి వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 2.58 లక్షల క్యూసెక్కులు, శ్రీశైలానికి 2.59 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరుతున్నది. గోదావరిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతున్నది. ఎస్సారెస్పీకి, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. శుక్రవారం రాత్రి 9 గంటల వరకు లక్ష్మీబరాజ్ వద్ద 7.71 లక్షల క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది.

మళ్లీ 48 అడుగులకు గోదావరి

భద్రాచలం వద్ద గోదావరి వరద శుక్రవారం మళ్లీ పెరిగింది. రాత్రి 9.15 గంటలకు 48 అడుగులు దాటడంతో మరోసారి రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికకు దగ్గరగా ప్రవహిస్తున్నది. 12.53 మీటర్ల ఎత్తు దాటి పారుతూ లక్ష్మీ బరాజ్ వైపు పరుగులు తీస్తున్నాయి. పుష్కరఘాట్ మునిగిపోయింది.

ఏపీకి మరో 3 టీఎంసీలు

ఇటీవలే కేఆర్ఎంబీ ఆధ్వర్యంలోని త్రీమెన్ కమిటీ సమావేశమై నాగార్జునసాగర్ నుంచి 5.5 టీఎంసీలు తెలంగాణకు, 4.5 టీఎంసీలను ఏపీ సర్కారుకు కేటాయించింది. ఒంగోల్ తోపాటు, పలు మున్సిపాలిటీల్లో తాగునీటి కొరత ఉన్నదని, మరో 3 టీఎంసీలను నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా విడుదల చేయాలని కోరుతూ కేఆర్ఎంబీకి ఏపీ లేఖరాసింది.

కేసీఆర్ సహకారంతోనే బాన్సువాడ అభివృద్ధి

- రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 11 వేల ఇండ్లు ఇచ్చిండు
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, జూలై 26: కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని స్థానిక ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా 11 వేల ఇండ్లను మంజూరు చేయించినట్టు చెప్పారు. ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజుతో కలిసి శుక్రవారం బాన్సువాడలోని తన నివాసంలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు పోచారం చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. పార్టీ మారినప్పటికీ మేలు చేసిన వారిని మరువొద్దన్న పోచారం.. కేసీఆర్ హయాంలో నియోజకవర్గంలో రూ.550 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. అంతేకాకుండా డిస్ట్రిబ్యూటరీ ల మరమ్మతులకు రూ.150 కోట్లు, ఎత్తిపోతల పథకాలకు రూ.150 కోట్లు, చందూర్ లిఫ్టుకు రూ.160 కోట్లు , సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు రూ.200 కోట్లతో చేపట్టినట్టు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలనే ఆలోచనతోనే పార్టీ మారినట్టు చెప్పారు.

ఎల్ఆర్ఎస్ పరిష్కారానికి ప్రత్యేక బృందాలు: భట్టి

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వీలైనంత వేగంగా పరిష్కరించాలని అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్ తీసుకోవాలని తెలిపారు. 'లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్' (ఎల్ఆర్ఎస్) అమలుపై శుక్రవారం సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇందుకోసం 33 జిల్లాల్లో ప్రత్యేకంగా బృందాలను రూపొందించుకోవాలని సూచించారు.

సెల్‌చార్జింగ్ పెడుతుండగా విద్యుత్తు షాక్

- తొమ్మిదేండ్ల బాలిక మృతి

కార్తీక (ఫైల్)

చింతకాని, జూలై 26 : తడి చేతులతో సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ విద్యుత్తు షాక్‌కు గురై బాలిక మృతిచెందింది. ఈ ఘటన ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి నామవరంలో శుక్రవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన కటికాల రామకృష్ణ దంపతులకు కూతురు అంజలి కార్తీక (9), కుమారుడు వెంకట గణేశ్ ఉన్నారు. శుక్రవారం ఉదయం కార్తీక తండ్రి వద్ద నుంచి సెల్‌ఫోన్ తీసుకున్నది. దానికి చార్జింగ్ లేకపోవడంతో తడి చేతులతో చార్జింగ్ పెడుతుండగా ఒక్కసారిగా కరెంట్ షాక్ తగలడంతో కుప్పకూలింది. కొద్ది సేపటికి గమనించి వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు.

కుక్కకాటుతో మహిళ మృతి

పూలమ్మ (ఫైల్)

చిన్నగూడూరు (మరిపెడ), జూలై 26: కుక్కకాటుకు గురై చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్లర్లలో గురువారం చోటుచేసుకున్నది. జంగం పూలమ్మ(36)ను ఈనెల 5న పిచ్చి కుక్క కరవడంతో స్థానికంగా చికిత్స పొందుతున్నది. వారం రోజుల క్రితం ఆమె రేబిస్ వ్యాధిబారిన పడింది. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది.

సారలమ్మ పూజారి మృతి

సంపత్ (ఫైల్)

తాడ్వాయి, జూలై 26: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సారలమ్మ ప్రధాన పూజారి కాక సంపత్(35) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. సంపత్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందాడు. జాతరలో సేవలందించిన సంపత్ మరణంతో పూజారుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

చిత్రం

బంగారం లాంటి టైటిల్?

మహేశ్‌బాబు–రాజమౌళి సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన విషయం ఒకటి బయటకు వచ్చింది. ఈ పాన్ వరల్డ్ ఫ్రాంచైజీకి 'గోల్డ్' అనే పేరును ఖరారు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ట్రెజర్ హంట్ నేపథ్యంలో సాగే కథాంశం కావడం చేత, 'గోల్డ్' అనే టైటిల్ ఈ కథకు యాప్ట్‌గా ఉంటుందని, పైగా 'గోల్డ్' యూనివర్సల్ టైటిల్ కాబట్టి.. ఈ టైటిలే కరెక్ట్ అని రాజమౌళి భావిస్తున్నారట. ఇందులో మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఓ పాత్ర హనుమంతుడి లక్షణాలతో కూడి ఉంటుందట. దీనికి సంబంధించిన నిజానిజాలు తెలియాల్సివుంది. ఇదిలావుంటే.. షూటింగ్ ప్రారంభానికి ముందే ఈ సినిమాకు సంబంధించిన ఓ గ్లింప్స్‌ని విడుదల చేసే యోచనలో రాజమౌళి ఉన్నట్టు వినికిడి. ఆ గ్లింప్స్ ద్వారా ఇందులో నటించే నటీనటుల వివరాలు ప్రకటిస్తారట. అదే రోజున టైటిల్ కూడా అనౌన్స్ చేస్తారా? అనేది తెలియాల్సివుంది. విజయేంద్రప్రసాద్ కథనైతే సిద్ధం చేశారు. మాటలు రాసే బాధ్యతను సాయిమాధవ్ బుర్రాకు అప్పజెప్పే యోచనలో దర్శకధీరుడు ఉన్నట్టు ఇన్‌సైడ్ టాక్. త్వరలోనే ఈ సినిమాకోసం రాజమౌళి ఓ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. అది పూర్తయ్యాకే షూటింగ్ అని తెలుస్తున్నది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఇందులో కీలమైన ప్రతినాయకుడి పాత్రను చియాన్ విక్రమ్ పోషించనున్నారట.

సస్పెన్స్ థ్రిల్లర్ 'జ్యువెల్ థీఫ్'

కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న చిత్రం 'జ్యువెల్ థీఫ్'. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల టీజర్, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో కృష్ణసాయి మాట్లాడుతూ..తాను హీరో కృష్ణ అభిమానినని, ఆయన స్ఫూర్తితో సినిమాల్లోకి వచ్చానని, సస్పెన్స్ థ్రిల్లర్ కథతో సినిమాను తెరకెక్కించామని తెలిపారు. ఓ రాబరీ నేపథ్యంలో నడిచే ఈ కథ ఆద్యంతం ఉత్కంఠను పంచుతుందని దర్శకుడు పీఎస్ నారాయణ అన్నారు. ప్రేమ, అజయ్, కన్నడ హీరోలు శ్రీధర్, వినోద్ కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.శ్రీలేఖ, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: పీఎస్ నారాయణ.

వాటిని అస్సలు పట్టించుకోను

కీర్తి సురేశ్ కొంతకాలంగా ప్రేమలో ఉన్నదట. తన చిరకాల స్నేహితుడే తన ప్రియుడట. త్వరలోనే అతడ్ని కీర్తి పెళ్లాడబోతున్నదట. గత కొంతకాలంగా కోలీవుడ్ మీడియాలో ఈ వార్త తెగ చక్కర్లు కొడుతున్నది. ఇదిలావుంటే.. కీర్తిసురేశ్ నటించిన 'రఘు తాత' చిత్రం ఆగస్ట్ 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా కీర్తి ఆ సినిమా ప్రమోషన్స్‌లో విరివిగా పాల్గొంటున్నది. ఇదే అదనుగా మీడియావాళ్లు పెళ్లి వార్త గురించి కీర్తిని ప్రశ్నించారు. కీర్తి మాట్లాడుతూ 'నా కెరీర్ గురించి, నా పాత్రల గురించి ఎవరైనా వివరణాత్మకంగా విమర్శలు చేస్తే వాటిని తప్పకుండా స్వీకరిస్తా. ఎందుకంటే విమర్శల వల్ల జాగ్రత్త పడొచ్చు. కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. కానీ నా వ్యక్తిగత విషయాల గురించి కామెంట్ చేస్తే మాత్రం అస్సలు పట్టించుకోను. పరిగణనలోకి తీసుకోను కూడా. ఒకవేళ పొరపాటున పట్టించుకుంటే, మీరంతా కలిసి ఆ అబద్ధాన్ని నిజం చేసేస్తారు' అంటూ అందంగా నవ్వేసింది కీర్తిసురేశ్.

డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్

రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ జోరు పెంచారు. ఈ నెల 29న మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదలకానుంది. శుక్రవారం ఈ సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పాట నాయకానాయికల మధ్య చక్కటి రొమాంటిక్ కెమిస్ట్రీతో ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమాలో రామ్ ఓల్డ్‌సిటీ శంకర్ పాత్రలో కనిపించనున్నారు. 'ఇస్మార్ట్ శంకర్' మాస్ హిట్‌గా నిలవడంతో సీక్వెల్ 'డబుల్ ఇస్మార్ట్' పై భారీ అంచనాలున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. కావ్యథాపర్, సంజయ్‌దత్, అలీ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్.

బాల్యమిత్రుల భావోద్వేగాలు

కులాల కుళ్లు స్నేహితుల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపింది? అనే ప్రశ్నకు సమాధానంగా రూపొందుతోన్న చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదువంశీ దర్శకుడు. పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మాతలు. నిహారిక కొణిదెల సమర్పకురాలు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ ఆగస్ట్ 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. సహజత్వానికి దగ్గరగా సినిమాను దర్శకుడు తెరకెక్కించినట్టు ట్రైలర్ చెబుతున్నది. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎడురోలు.

ఏమైందో మనసే

స్వీయ దర్శకత్వంలో పవన్‌కుమార్ హీరోగా నటిస్తున్న చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహ మాల్వియ కథానాయిక. ఆగస్ట్ 2న విడుదలకానుంది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా సెకండ్ సింగిల్ 'ఏమైందో ఏమో..' ఇటీవల విడుదలైంది. కార్తీక్ బి. కొడకండ్ల స్వరపరచిన ఈ గీతాన్ని కృష్ణవేణి మల్లవజ్జల రచించారు. రొమాంటిక్ సాంగ్‌గా తెరకెక్కించారు. విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. నేటి యువతరం మెచ్చే అన్ని అంశాలున్న చిత్రమని హీరో, దర్శకుడు పవన్‌కుమార్ తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలు: పవన్‌కుమార్ కొత్తూరి, బిషాలి గోయెల్.

మాస్ మెకానిక్

స్టార్‌హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రామ్ తాళ్లూరి నిర్మాత. అక్టోబర్ 31న దీపావళి పండుగకు సినిమా విడుదల కానుంది. ఈ సినిమా గ్లింప్స్‌ని ఈ నెల 28న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా గ్లింప్స్ రిలీజ్ డేట్‌ని మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో విశ్వక్‌సేన్ లుక్ మాస్ ప్రేక్షకులకి నచ్చేలా ఉంది. ట్రైయాంగిల్ ప్రేమకథగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, శ్రద్ధాశ్రీనాథ్ కథానాయికలు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ కాటసాని, సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాణం: ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్.

కేసీఆర్ అంటే అందరికీ గౌరవం

ఆయన సరదాగా చెప్పిన మాటను పాటలో తీసుకున్నాం

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ హీరోగా నటిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్‌ముంత ఛోడ్‌చింత' అనే గీతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడిన 'ఏం జేద్దామంటవ్ మరీ..' అనే మాటలను హుక్‌లైన్‌గా తీసుకోవడం వివాదానికి దారితీసింది. తెలంగాణ సాధకుడు, పదేళ్లు రాష్ట్రాధినేతగా పనిచేసిన కేసీఆర్ వంటి గొప్ప నాయకుడిని కించపరిచే విధంగా ఆయన మాటలను వాడారని తెలంగాణవాదుల నుంచి విమర్శలొచ్చాయి. తాజాగా ఈ వివాదంపై చిత్ర సంగీత దర్శకుడు మణిశర్మ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. కేసీఆర్ గారంటే అందరికీ గౌరవమని, ఆయన సరదాగా చెప్పిన ఓ మాటను పాటలో తీసుకున్నామని, ఎవరినీ నొప్పించడం తమ ఉద్దేశం కాదని వివరణ ఇచ్చారు. 'చాలా మంది ఆ పాటను ఐటెమ్‌సాంగ్ అనుకుంటున్నారు. కానీ అది డ్యూయెట్. సోషల్‌మీడియాలో వచ్చే మీమ్స్‌ను తీసుకొని లిరిక్స్ రాశాం. స్వరకర్తగా నా 27 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఇప్పటివరకు ఎవరినీ బాధపెట్టలేదు. కేసీఆర్‌గారు సరదా చెప్పిన మాటను తీసుకున్నాం. ఈ పాట ద్వారా కేసీఆర్‌గారిని ఓసారి గుర్తుచేసుకున్నాం. అందరూ అలానే భావించాలని కోరుతున్నా' అని మణిశర్మ చెప్పారు.

అంజనేయుడిగా అజిత్?

'హను–మాన్'తో పాన్‌ఇండియా విజయాన్ని అందుకున్నారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్'ని కూడా ఆయన అనౌన్స్ చేశారు. దీనికి సంబంధించిన స్క్రిప్ట్‌ని పూర్తి చేసి, పూజాకార్యక్రమాలను కూడా నిర్వహించారాయన. ప్రస్తుతం ప్రీపొడక్షన్ పనులు జరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ సినిమాలో ఆంజనేయస్వామి పాత్రను ఓ స్టార్‌హీరో పోషిస్తారని గతంలో ప్రశాంత్‌వర్మ ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం తమిళ స్టార్‌హీరో అజిత్‌కుమార్ ఆంజనేయుడిగా పర్‌ఫెక్ట్ అని ప్రశాంత్‌వర్మ భావిస్తున్నారట. త్వరలో ఆయనకు కథ వినిపించనున్నట్టు తెలుస్తున్నది. అజిత్ ఈ పాత్రకు ఒప్పుకుంటే ఈ సినిమా స్థాయి మరింత పెరిగే అవకాశం ఉంది.

టైమ్ వేస్ట్ చేసుకోకు

'విలువలేని మనుషుల గురించి పట్టించుకోవడం మానేస్తే మంచిది. పనికిమాలిన ప్రపంచానికి దూరంగా బతకండి. మనం ఆనందంగా బతకాలి. మనవారిని కూడా ఆనందంగా ఉంచాలి. ఇదే నిజమైన జీవితం.' అంటూ తన ఇన్‌స్టా ద్వారా అభిమానులకు మెసేజ్ చేసింది బాలీవుడ్ భామ పరిణితీ చోప్ర